సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం


దానం నాగేందర్‌కు గదను బహూకరిస్తున్న కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు

ముషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల మద్దతుతో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో దానంను మంగళవారం కలిసి గదను బహూకరించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఒక్కసారి ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. దేశంలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉందని, పార్టీ నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచారాన్ని ఉధృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాము, సాయి, గంగపుత్ర కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సకల జనుల చర్చా వేదిక కన్వీనర్ దొమ్మట వెంకటేష్

కేంద్రంలో మతరాజ్యం కొనసాగుతోంది

- సకల జనుల చర్చా వేదిక కన్వీనర్ వెంకటేష్

రాంనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా నశించాయని, మతరాజ్యం కొనసాగుతోందని సకల జనుల చర్చా వేదిక కన్వీనర్ దొమ్మట వెంకటేష్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడే పార్టీలకే మద్దతు ఇవ్వాలని సూచించారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సకల జనుల చర్చా వేదిక ఆధ్వర్యంలో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలన మతం పునాదులపై కొనసాగుతుందన్నారు. సోషల్ మీడియాపై ఆధారపడుతూ బీజేపీ ప్రజలను మభ్యపెట్టేందుకు అసత్య ప్రచారం చేస్తోందన్నారు. మోదీ పదేళ్ల పాలనలో పేద ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. నల్ల చట్టాలను తీసుకువచ్చి ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని అన్నారు. లౌకిక శక్తులన్నీ ఏకమై ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సకల జనుల చర్చా వేదిక కో-కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, డా. జి. శ్రీహరి, జి. శ్యాంసుందర్‌గౌడ్, డాక్టర్ టి. యాదగిరి, రామగిరి ప్రకాష్ పాల్గొన్నారు.


భోలక్‌పూర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బీజేపీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

ముషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ లక్ష్యమని, అది బీజేపీతోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ ఇందిరానగర్, బాకారం, రంగానగర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి కిషన్‌రెడ్డి అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దశరథ్, వెంకటయ్య, నర్సింగ్‌రావు, ఎల్లయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


జనార్దన్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా జనార్దన్

రాంనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రాంనగర్ డివిజన్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు రావర్తి జనార్దన్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ ఆయనకు మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

28న డ్యాన్స్ ఫెస్ట్

రాంనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు డ్యాన్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని సంస్థ నిర్వాహకులు, ప్రముఖ డైరెక్టర్ ఇ.సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్ మంగళవారం తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 26లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9963222040 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీలకు నిధులు మంజూరు చేయాలి : సీపీఎం

రాంనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కకు మంగళవారం లేఖ రాశారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరు నెలలుగా డిస్పెన్సరీలకు అద్దె చెల్లించకపోవడంతో భవన యజమానులు తాళాలు వేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మిర్యాలగూడ, బీబీనగర్, మేడ్చల్, బొల్లారం, శామీర్‌పేట డిస్పెన్సరీలు మూతపడ్డాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలు రూ. 2.10 కోట్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


అంబర్‌పేట పటేల్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు


రాంనగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ బొట్టు శ్రీనివాస్, కమిటీ సభ్యులు


కాచిగూడలో హనుమాన్ పూజలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, బీజేపీ నేతలు నందకిషోర్‌యాదవ్, ఎక్కాల కన్నా తదితరులు


రాంనగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు

జై హనుమాన్

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మంగళవారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హనుమాన్, రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల కమిటీలు, కుల, బస్తీ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అన్నదానం, పులిహోర, మజ్జిగ, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

\- ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం ఆంధ్రజ్యోతి


కాచిగూడలో హనుమాన్ ర్యాలీలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు


రాంనగర్‌లో శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న అభయాంజనేయస్వామి సేవా సమితి సభ్యులు


కవాడిగూడ అడ్వకేట్స్ కాలనీలో హనుమాన్ జయంతిలో కార్పొరేటర్ రచనశ్రీ, బస్తీకమిటీ నాయకులు మోహన్‌సాయి, సాయిరాం తదితరులు



ఆర్టీసీ క్రాస్‌రోడ్, రాంనగర్‌లో హనుమాన్ శోభాయాత్రలో భక్తులు


చిక్కడపల్లి వివేక్‌నగర్ హనుమాన్ ఆలయంలో పూజలో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్


లోయర్ ట్యాంక్‌బండ్‌లో బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న బజరంగ్‌దళ్ మహంకాళి జిల్లా సహ సంయోజక్ వెదిరి రాంరెడ్డి, బజరంగ్‌దళ్ నేతలు


గోల్నాక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ దంపతులు


ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో శోభాయాత్ర స్వాగత వేదికపై బాలాంజనేయుడి వేషధారణలో ఉన్న చిన్నారిని ఎత్తుకున్న కార్పొరేటర్ కె. రవిచారి


బాగ్‌అంబర్‌పేటలో హనుమాన్ జయంతిలో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులు


చిక్కడపల్లిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. దిడ్డి సుధాకర్, దివ్యాంగుల కమిటీ చైర్మన్ దర్శనం రమేష్


భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలో శోభాయాత్రలో పాల్గొన్న వారికి మజ్జిగ పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్


హనుమాన్ వేడుకలో రాంనగర్ రామాలయ కమిటీ చైర్మన్ డి. రవియాదవ్, కమిటీ సభ్యులు, భక్తులు


కవాడిగూడలో హనుమాన్ శోభాయాత్రకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన వేదికపై బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్‌రాం తదితరులు

అసెంబ్లీకి ఒక పార్టీ.. పార్లమెంట్‌కు మరో పార్టీ

అంబర్‌పేట ప్రజల విలక్షణ తీర్పు

బర్కత్‌పుర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పార్టీకి, లోక్‌సభ ఎన్నికల్లో మరో పార్టీకి ఓటు వేస్తూ విలక్షణమైన తీర్పు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి జై కొడుతున్నారు. బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పాగా వేసింది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి తొలిసారిగా బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అతి తక్కువ మెజారిటీతో విజయం సాధించారు. నియోజకవర్గంలో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జి. కిషన్‌రెడ్డిపై 1016 ఓట్ల మెజారిటీతో కాలేరు వెంకటేష్ గెలుపొందారు. కాలేరుకు 62 వేల 350 ఓట్లు రాగా, కిషన్‌రెడ్డికి 61 వేల 334 ఓట్లు, టీజేఎస్ అభ్యర్థికి 4 వేల 850 ఓట్లు వచ్చాయి.

ఆ తర్వాత ఐదు నెలల వ్యవధిలో 2019 ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన జి. కిషన్‌రెడ్డికి ప్రజల్లో బాగా సానుభూతి పెరిగింది. నియోజకవర్గంలో మొత్తం లక్షా 32 వేల 160 ఓట్లు ఎంపీ ఎన్నికల్లో పోల్ కాగా, బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 80 వేల 422 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని కిరణ్‌యాదవ్‌కు 34 వేల 854, కాంగ్రెస్ అభ్యర్థి ఎం. అంజన్‌కుమార్‌యాదవ్‌కు 13 వేల 510 ఓట్లు వచ్చాయి. కిషన్‌రెడ్డికి అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు 48 వేల 410 ఓట్ల మెజారిటీ అందించారు.

2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు మరోసారి మెజారిటీ ఇచ్చారు. మొత్తం లక్షా 45 వేల 470 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు 74 వేల 416 ఓట్లు, బీజేపీ అభ్యర్థి సి. కృష్ణాయాదవ్‌కు 49 వేల 879 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్. సి. రోహిణ్‌రెడ్డికి 18 వేల నాలుగు ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాలేరు వెంకటేష్‌కు 24 వేల 537 ఓట్ల మెజారిటీ వచ్చింది. ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పునిచ్చే అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

ప్రధాని మోదీ గాలి బలంగా వీస్తున్న నేపథ్యంలో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డికి మరొకసారి ప్రజలు భారీ మెజారిటీ అందిస్తారని బీజేపీ నేతలు, ఆరు గ్యారెంటీలతో మెజారిటీ సాధిస్తామని కాంగ్రెస్ నేతలు, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామని, దీంతో ప్రజలు భారీ మెజారిటీ అందిస్తారని బీఆర్ఎస్ నేతలు, ఇలా ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డికి నియోజకవర్గం ప్రజలతో మంచి సంబంధాలు ఉండడం, స్థానికత, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు నియోజకవర్గంలో పాత పరిచయాలు ఉండడం, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు కలిసి వస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మీ డబ్బులు మాకొద్దు బాబోయ్..!

- కాలేజీల యాజమాన్యాలతో జేఎన్‌టీయూ ఎఫ్‌ఎఫ్‌సీ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీల వ్యవహారం కొత్తమలుపు తిరిగింది. మొన్నటి వరకు తనిఖీల కోసం ప్రైవేట్ కాలేజీలకు వెళ్లిన కొందరు జేఎన్‌టీయూ అధికారులు పెద్దమొత్తంలో ముడుపులు డిమాండ్ చేశారు. తాజాగా "మీ డబ్బులు మాకొద్దు బాబోయ్" అంటూ.. ఆయా కాలేజీల యాజమాన్యాలకు ఓ నమస్కారం పెట్టి వెనుదిరుగుతున్నారు. ఈ మార్పు చూసి జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తనిఖీల సమయంలో డబ్బు తీసుకోకుండా నిలువరించిన జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు అఫిలియేషన్ ఇచ్చేటప్పుడు కూడా ఇదే పద్ధతిని పాటిస్తారో, లేదోనని కాలేజీల యాజమాన్యాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. తనిఖీ అధికారులపై ఎన్నికల అధికారులు కూడా నిఘా పెట్టారు.

హైదరాబాద్‌లో ఆకార్డియన్ టెక్నాలజీస్ కార్యాలయం

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు


ఆకార్డియన్ టెక్నాలజీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు


రవీంద్రభారతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూకెకు చెందిన ప్రముఖ సంస్థ ఆకార్డియన్ టెక్నాలజీస్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు హైటెక్‌సిటీలో మంగళవారం ప్రారంభించారు. సంస్థ కార్యక్రమాల గురించి మేనేజింగ్ డైరెక్టర్ ప్రభల శ్రీనివాస్ మంత్రికి వివరించారు. కార్యక్రమంలో కామరాజు నరేంద్రకుమార్, ప్రదీప్‌కుమార్, హర్కార శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

- ఆగి ఉన్న కారును ఢీకొట్టిన బస్సు
- ఆరుగురు నగర వాసులకు స్వల్ప గాయాలు

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ఆగి ఉన్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కారు (ఏపీ 39 డీజే 2708)లో మంగళవారం మధ్యాహ్నం అలిపిరి వద్ద తనిఖీలు పూర్తి కాగానే తిరుమలకు బయలుదేరారు. వినాయక ఆలయం దాటిన తర్వాత ఓ మలుపు వద్ద సాంకేతిక సమస్యతో కారు ఆగిపోయింది. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు(ఏపీ 03 జెడ్ 0187) కారును ఢీకొట్టడంతో అందులో ఉన్న ఆరుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు వెనక భాగం ధ్వంసమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసును తప్పుదోవ పట్టించిన ఎస్ఐ సస్పెన్షన్


ఎస్ఐ నారాయణసింగ్

గాజులరామారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన ఎస్ఐని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. జనవరిలో సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుడి పక్కన నిర్మానుష్య ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ హత్యకు గురయింది. ఆ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సూరారం స్టేషన్‌లో అడ్మిన్ ఎస్ఐగా ఉన్న నారాయణసింగ్ హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేయడంతో ఉన్నతాధికారులు ఎస్ఐని సస్పెండ్ చేశారు.

రేపటి నుంచి పరుచూరి రఘుబాబు స్మారక నాటక పోటీలు

రవీంద్రభారతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ స్థాయి నాటక, నాటికల పోటీలు ఈ నెల 25 నుంచి 27 వరకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు రాత (నాటిక), జేబు చెప్పిన ఊసులు, రైతేరాజు, బూడిద, నాటికలు ప్రదర్శించనున్నారు. రెండో రోజు విజ్ఞానభారతం, అమృతహస్తం, భూగోళం, దారణం నాటికలు, మూడోరోజు జైజవాన్, జైకిసాన్, అనూహ్యం, కపిరాజు, కాపలా, నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలను ప్రదర్శించనున్నారు. నాటకోత్సవాల్లో ప్రముఖనటుడు మురళీమోహన్, ఆర్.నారాయణమూర్తి, బి.గోపాల్, జీవితరాజశేఖర్, యండమూరి వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొంటారని పరుచూరి సోదరులు ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు ఆకస్మిక మృతి


మహమ్మద్ గౌస్ (ఫైల్)

అంబర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అంబర్‌పేట ఏ-బ్లాక్ అధ్యక్షుడు మహమ్మద్‌గౌస్(65) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఉదయం డయాలసిస్ నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తీవ్ర అనారోగ్యానికి గురై సాయంత్రం కన్నుమూశారు. మహమ్మద్ గౌస్ మృతి పట్ల మాజీ ఎంపీ వి. హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు గడ్డం శ్రీధర్‌గౌడ్, సత్తి బాబుగౌడ్, షేక్ జమీర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి మే 2 వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి మే 2 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు విభాగాలకు చెందిన పరీక్షలుంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు.

తేదీ	ఇంటర్(ఉదయం)	మధ్యాహ్నం	ఎస్ఎస్‌సీ (ఉదయం)	మధ్యాహ్నం
25-04-2024	తెలుగు/ఉర్దూ/హిందీ	అరబిక్	తెలుగు/కన్నడ/తమిళ్/మరాఠీ	సైకాలజీ
26-04-2024	ఇంగ్లిష్	సోషియాలజీ	ఇంగ్లిష్	ఇండియన్ కల్చర్, హెరిటేజ్
27-04-2024	పొలిటికల్ సైన్స్	కెమిస్ట్రీ/పెయింటింగ్	మ్యాథమెటిక్స్	బిజినెస్ స్టడీస్
29-04-2024	కామర్స్/బిజినెస్ స్టడీస్	ఫిజిక్స్/సైకాలజీ	సైన్స్ అండ్ టెక్నాలజీ	హిందీ
30-04-2024	హిస్టరీ	మ్యాథమెటిక్స్/జాగ్రఫీ	సోషల్ స్టడీస్	ఉర్దూ
01-05-2024	ఎకానామిక్స్/ మాస్‌కమ్యూనికేషన్స్	బయాలజీ/అకౌంటెన్సీ /హోమ్ సైన్స్	ఎకనామిక్స్	హోంసైన్స్
02-05-2024	ఆల్ ఒకేషనల్ సబ్జెక్ట్స్(థియరీ)	========	ఆల్ ఒకేషనల్ సబ్జెక్ట్స్ (థియరీ)	ఆల్ ఒకేషనల్ సబ్జెక్ట్స్ (ప్రాక్టికల్స్)